- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

బుధవారం
25-03-2026

సంపుటి : 01 సంచిక : 3 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 NAMASTEY MAHAAPRABHA

# లోక్‌సభ సీట్ల పెంపు..

2011 జనాభా లెక్కలే ప్రాతిపదిక

543 నుండి 816కు పెరగనున్న లోక్‌సభ సీట్లు:

## దేశవ్యాప్తంగా పెరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు






- తెలంగాణలో 26 ఎంపీ, 179 అసెంబ్లీ స్థానాలు
- ఏపీలో 38కి పెరగనున్న ఎంపీ సీట్లు:
- యూపీలో అత్యధికంగా 120 ఎంపీ స్థానాలు: ప్రధాన రాష్ట్రాల వారీగా కొత్త లెక్కలు
- 2029 నుండి మహిళా రిజర్వేషన్లు అమలు: మహిళలకు 33 శాతం కోటా ఖరారు
- పెరగనున్న ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు: ఎస్సీలకు 126, ఎస్టీలకు 70 సీట్లు
- పార్లమెంట్‌లో త్వరలో రాజ్యాంగ సవరణ బిల్లు
- కసరత్తు పూర్తి చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, - మార్చి 24 (మహా ప్రభ)

త్వరలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను, అలాగే పార్లమెంట్ స్థానాలను కేంద్రం పెంచబోతున్న సంగతి తెలిసిందే. అటు అసెంబ్లీలలో, ఇటు పార్లమెంట్‌లో 50 శాతం సీట్లను కేంద్రం పెంచబోతుంది. అలాగే, 2029 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ కోటాను కూడా అమలు చేయనున్నారు. ఇక ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 ఎంపీ సీట్లు 816 సీట్లుగా మారుతాయి. తెలంగాణ అసెంబ్లీకి సంబంధించి 119 స్థానాలుండగా, ఈ సంఖ్య 2029లో 179కి చేరుతుందిఅలాగే -మిగతా 3 లో



## ఇరాన్‌తో యుద్ధం వేళ మోదీకి ట్రంప్ ఫోన్..

- హార్ముజ్ జలసంధిని తెరవడం చాలా అవసరమని ఇరువురు నేతలు అభిప్రాయం
- ఉద్రిక్తతలు తగ్గించేందుకు, శాంతి స్థాపనకు ఇండియా ఎప్పుడూ మద్దతుగా ఉంటుందన్న మోదీ
- హార్ముజ్ జలసంధి సహా కీలక అంశాలపై చర్చ

న్యూఢిల్లీ - మార్చి 24 (మహా ప్రభ)

ఇరాన్‌తో యుద్ధం జరుగుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్ చేశారు. ఇరాన్ యుద్ధం సహా పశ్చిమాసియా పరిస్థితులు, హార్ముజ్ జలసంధి వంటి అంశాలపై చర్చలు జరిపారు. ఈ విషయాన్ని మంగళవారం ఇటు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొనగా, అటు అమెరికా తరఫున ఇండియాలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు.ప్రస్తుత పరిస్థితుల్లో హార్ముజ్ జలసంధిని తెరవడం చాలా అవసరమని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. -మిగతా 3 లో

## బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బీఆర్ఎస్

### ఏం తప్పు చేశామని అంతలా విమర్శలు



- విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడం తప్పా
- మహిళలను కోటీశ్వరులను చేయాలనుకోవడం తప్పా
- బీమా పథకంలో ఆదుకోవాలనుకోవడం సరికాదా
- బడ్జెట్ ప్రతులు చించి ఎందుకు పారిపోయారు
- గతంలో అసెంబ్లీలో మాట్లాడే పరిస్థితి ఉండేదా
- బడ్జెట్‌పై చర్చకు సమాధానంలో బిఆర్ఎస్‌పై భట్టి చురకలు

హైదరాబాద్ - మార్చి 24 (మహా ప్రభ)

బడ్జెట్‌లో మేం ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వడాన్ని కూడా ఓర్వలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించడం నేరమా అని నిలదీశారు. కుటుంబంలో పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబ పరిస్థితి తలకిందులైపోతుంది. అలాంటి కుటుంబాలకు ఆర్థిక సమస్యలు ఉండకూడదని బీమా కల్పించాం. సంక్షేమ పథకాల గురించి చెబుతుంటే.. -మిగతా 3 లో




## క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు

- మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు
- క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు
- హిందువుల,సిక్కు, బౌద్ధ మతస్థులకే కుల హక్కులు
- ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ - మార్చి 24 (మహా ప్రభ)

మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. -మిగతా 3 లో



## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బాంబు బెదిరింపు మెయిల్

- మోడీ,అమిత్ షా,జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక
- ఢిల్లీ మెట్రో, అసెంబ్లీలకు బాంబు బెదరింపులు


న్యూఢిల్లీ, - మార్చి 24 (మహా ప్రభ)

దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, -మిగతా 3 లో

## లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత పాపారావు..

ఒడిశాలో మరో నేత సరెండర్..!

3



## వాయు కాలుష్య దేశంగా పాక్

- ప్రపంచంలోనే అత్యంత వాయు కాలుష్య నగరం మన దేశంలోనే..



3

## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్



- వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది
- దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, - మార్చి 24 (మహా ప్రభ)

దాదాపు ఆరున్నర, 7 లక్షల మంది దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ చాలా వాగ్దానాలు ఇచ్చింది. 100 రోజుల్లోనే 6 వేల పెన్షన్ అని చెప్పింది. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చింది. బ్యాక్ లాగ్ పోస్టుల విషయంలో, -మిగతా 3 లో

## జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం



- పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్
- నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి
- తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన
- నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు

జగిత్యాల - మార్చి 24 (మహా ప్రభ)

తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా.. పార్టీ అధికారంలోకి వచ్చినందుకు సంతోషపడ్డానన్నారు. మంగళవారం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. -మిగతా 3 లో

# టీబీ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి...

### ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావు..




**మెదక్ జిల్లా – మార్చి 24 (మహా ప్రభ)**
టీబీ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ రావు అన్నారు. మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన టిబి ముక్త్ అభియాన్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ టీబీ నిర్మూలనకు గాను ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. టిబి లక్షణాలు ఉన్నట్లు అనుమానం వస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. టీబీ వ్యాధి సోకిన వారిని, వారి కుటుంబాలకు అండగా నిలిచి ఆరోగ్యవంతంగా జీవించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు టీబీపై అవగాహన కల్పిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి అందరూ ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దొంతి గ్రామంలో ఏడాది పాటు నిలిచిపోయిన ఉపాధి పనులు మళ్లీ మొదలు ...



**శివంపేట ..మార్చి 24 (మహాప్రభ)**
శివంపేట మండలంలోని దొంతి గ్రామంలో ఏడాది పాటు నిలిచిపోయిన ఉపాధి హామీ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ నీరుడి మౌనిక- మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈ పనులు మొదలుపెట్టారు. నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభం కావడంతో ఉపాధి హామీ కూలీలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భవనగిరి శ్రీనివాస్ లక్ష్మీకాంతరావు, వార్డు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిసి రోడ్లను పరిశీలించిన గ్రామ సర్పంచ్ ...



**శివంపేట, మార్చి 24 (మహాప్రభ):**
శివంపేట మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో సిసి రోడ్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ పెంజర్ల మమత-నర్సింలు దగ్గరుండి సిసి రోడ్లు పరిశీలిస్తున్నారు.. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా సీసీ రోడ్ల నిర్మాణం సాగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు... గ్రామంలో ప్రతి విధుల గుండా సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందని, దీనికిగాను ప్రజలందరూ సహకరించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల వల్ల గ్రామాభివృద్ధి చెందుతుందని, ఇప్పటివరకు చాలా గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు వచ్చి చాలా మంది ప్రజలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారని అదేవిధంగా మన గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు..

## అతివేగంపై ట్రాఫిక్ పోలీసుల చర్యలు

**కరీంనగర్, – మార్చి 24 (మహా ప్రభ)**
నగరంలోని 36వ డివిజన్ మారుతి నగర్ జెండా చౌరస్తా నిత్యం రద్దీగా ఉండే ప్రదేశం. ఇసుక ట్రాక్టర్ వాహనాలు అతివేగంగా నడుపుతూ రాకపోకల వారిని, స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని బీజేపీ నాయకుడు కొంపెల్లి సాగర్ ట్రాఫిక్ పోలీసులకు తెలియజేశారు. వెంటనే స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల రాకపోకలు కొంతవరకు నియంత్రణలోకి వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తోట అనిల్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# గ్యాంగ్ ఫైల్స్' నేరాలపై జిల్లా ఎస్పీ కీలక సమీక్ష





### -- నేరస్తులకు శిక్ష పడేలా పక్కా సాక్ష్యాధారాలు సేకరించాలి.

**కామారెడ్డి జిల్లా – మార్చి 24 (మహా ప్రభ)**
కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపిఎస్ దొంగతనాలు, దోపిడీలు, రాబరీ నేరాలకు సంబంధించిన 'గ్యాంగ్ ఫైల్స్' పై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గతంలో నేరాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాల నేర ప్రవర్తన మరియు సాక్ష్యాధారాల సేకరణ వివరాల గురించి క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ , ప్రతి నేరస్తుడి పూర్తి ప్రొఫైల్‌ను పక్కాగా సిద్ధం చేయాలని ఆదేశించారు. వారిపై నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. నేరస్తులకు చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చూడటమే లక్ష్యంగా, పెండింగ్ కేసుల్లో విచారణను వేగవంతం చేయాలని ఎస్పీ సూచించారు. కోర్టులో నిందితుల నేరాన్ని నిరూపించేలా శాస్త్రీయ మరియు సాంకేతిక సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించి, త్వరితగతిన అభియోగపత్రాలను దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా ప్రతీ కేసులో అధికారులు వ్యక్తిగత శ్రద్ధ వహించాలని, ప్రాపర్టీ రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు.
జిల్లాలో నేరాల నియంత్రణకు గాను 'ఆపరేషన్ కవచ్' ను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ నిర్ణయించారు. ఈ మేరకు సబ్ డివిజన్ అధికారులు మరియు సీఐలతో చర్చించి, రాత్రి గస్తీలను ముమ్మరం చేయడం, అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టడం వంటి కీలక సూచనలు చేశారు. ఆధునిక సాంకేతికతను మరియు సిసి కెమెరాల నిఘాను సమర్థవంతంగా వాడుకుంటూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు రాజీ లేకుండా పని చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు.
ఈ సమీక్షా సమావేశంలో కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి ఐపిఎస్, ఎల్లారెడ్డి డీఎస్పీ ఎస్. శ్రీనివాస్ రావు, బాన్సువాడ డీఎస్పీ బి. విఠల్ రెడ్డి, వివిధ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, రైటర్లు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంయుక్త ఫౌండేషన్ కోర్సు కార్యక్రమం






### -- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ,

**కామారెడ్డి జిల్లా – మార్చి 24 (మహా ప్రభ)**
ప్రత్యేక సెషన్ లో "ఒత్తిడిలో స్థైర్యం: 2025 కామారెడ్డి వరదలను ఎదుర్కోవడం ఌ వాతావరణ మార్పులకు సిద్ధంగా ఉన్న జిల్లాలను నిర్మించడం" అనే అంశంపై ప్రసంగించారు. ఎం.సి.ఆర్. హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్ కోర్సు డైరెక్టర్ హెచ్. అరుణ్ కుమార్, IAS (రిటైర్డ్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎం.సి.ఆర్. హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తెలంగాణలో నిర్వహిస్తున్న తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంయుక్త ఫౌండేషన్ కోర్సు కార్యక్రమంలో భాగంగా, కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఌ మేజిస్ట్రేట్ ఆశిష్ సాంగ్వాన్, IAS మంగళవారం ప్రత్యేక సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన "ఒత్తిడిలో స్థైర్యం: 2025 కామారెడ్డి వరదలను ఎదుర్కోవడం ఌ వాతావరణ మార్పులకు సిద్ధంగా ఉన్న జిల్లాలను నిర్మించడం" అనే అంశంపై ప్రసంగించారు. ప్రకృతి విపత్తుల సమయంలో సమర్థవంతమైన పరిపాలన, వేగవంతమైన స్పందన, సమన్వయంతో కూడిన చర్యలు ఎంతో ముఖ్యమని ఆయన తెలిపారు. 2025లో కామారెడ్డి జిల్లాలో సంభవించిన వరదలను ఎదుర్కొనే సమయంలో జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను వివరిస్తూ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, ప్రజల తరలింపు, సహాయక చర్యలు, విభాగాల మధ్య సమన్వయం వంటి అంశాలను ఆయన వివరించారు.
అలాగే, వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో జిల్లాలను మరింత ప్రతిస్పందనాత్మకంగా తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విభాగాలకు చెందిన 215 మంది గ్రూప్-1 అధికారుల శిక్షణార్థులు పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన అధికారులు ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేసి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ సూచించారు.
.

# తెలంగాణ రాష్ట్రంలో ఒకే రెడ్డి సంఘంగా ఏర్పడిన రాష్ట్ర రెడ్డి సంఘాలు.

### రాష్ట్ర కమిటీ కో కన్వీనర్ గా నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి ,

**కామారెడ్డి జిల్లా – మార్చి 24 (మహా ప్రభ)**
హైదరాబాద్ నాగోల్ ప్రాంతంలో పిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన రాష్ట్ర రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో నూతన హడ్ హాక్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో రెడ్ల భవిష్యత్తు భద్రత ఆర్థిక రాజకీయ అసమానతలు ఎదురవుతున్న ఇబ్బందుల దృశ ఈరోజు అన్ని సంఘాలు కూడా ఏకవాక్య తీర్మానంతో ఒకే సంఘాన్ని రాష్ట్రంలో ఒకటే రెడ్డి సంఘం ఉండాలనే నినాదంతో అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి ఈ యొక్క సాహో సపేతమైన నిర్ణయం తీసుకోవడం చరిత్రత్మకం.అని అన్నారు ఈ సమావేశంలో రాష్ట్ర కోకన్వీనర్ గా నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి నీ నియమించారు
తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పేద రెడ్లకు పేదరెడ్డి విద్యార్థులకు మేమున్నామని ఈ కమిటీ ద్వారా ప్రతి ఒక్కరికి కూడా భవిష్యత్తు కోసం వారికి భరోసా ఇవ్వడం జరుగుతుంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకవర్గంతో పాటు బడ్జెట్ కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి విజ్ఞప్తి చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఆయా సామాజిక వర్గ ప్రజలకి రాష్ట్ర స్థాయిలో ఏదైతే ప్రభుత్వాలు వారికి హైదరాబాద్ నడిబొడ్డున కుల భవనాలు నిర్మించిందో అదే విధంగా తెలంగాణ రాష్ట్ర రెడ్ల కోసం పది ఎకరాల స్థలాన్ని




కేటాయించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర కోకన్యునరుగా నా నియామకానికి సహకరించిన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి. రాష్ట్ర హడాక్ కమిటీ చైర్మన్ బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి,కి రాష్ట్ర రెడ్డి నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు
రాష్ట్ర అడ్ హాక్ కమిటీ చైర్మన్గా బద్దూరి వెంకటేశ్వర రెడ్డి కన్వీనర్ గా బుట్టెంగారి మాధవరెడ్డి, కో కన్వీనర్లుగా నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి కొట్టం మధుసూదన్ రెడ్డి వసంత రెడ్డి నూకల పద్మ రెడ్డి గంగుల శ్రీలత రెడ్డి నందికొండ గీతరెడ్డి సభ్యులుగా ఎన్నేపల్లి లింగారెడ్డి ఎలిమినేటి సుమన్ రెడ్డి సలహా దారులగా ఏనుగు సంతోష్ రెడ్డి పిట్టా శ్రీనివస్ రెడ్డి, గోపు జైపాల్ రెడ్డి, నల్ల సంజీవరెడ్డి నావల్గా సత్య నారాయణరెడ్డి బొక్క భూపాల్ రెడ్డి, బొబ్బిలి దామోదర్ రెడ్డి, నియమించబడ్డారు.

# బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బిఆర్ఎస్

మొదటి తరువాయి

వినడానికి బీఆర్ఎస్‌కు సమయం లేదా? క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కావాలని ఉద్యోగులు పదేళ్ల నుంచి అడుగుతూనే ఉన్నారు. గతంలో వారు మాట్లాడేందుకు కూడా భయపడే పరిస్థితి కల్పించారు. గతంలో నేను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదు. డిప్యూటీ సీఎం హోదాలో బడ్జెట్ ప్రవేశ పెడితే.. బడ్జెట్ పత్రాలు చించి సభ నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ సభ్యులు చెప్పిందే మేం వినాలి.. వినకపోతే మేం వెళ్లిపోతామంటున్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడకండి అంటూ భట్టి చురకలంటించారు. రైతు భరోసా పథకాన్ని బీఆర్ఎస్ ఎన్నికల స్కీమ్‌గా మార్చుకుంది. 2018లో ప్రజలు ఓట్లేసేందుకు క్యూలైన్‌లో ఉండగా.. రైతు భరోసా నిధులు జమచేశారు. మేం ఎప్పుడూ ఎన్నికల కోసం రైతు భరోసా నిధులు జమచేయలేదు. రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం. రైతులకు ఉచిత కరెంట్ పథకం పేటెంట్ హక్కు మాదే. వ్యవసాయాన్ని పండగలా చేసిందే కాంగ్రెస్. మా ప్రభుత్వం రాగానే రైతులకు ఒకేసారి రుణమాఫీ చేసింది. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదన్నదే బీఆర్ఎస్ ఆలోచన అంటూ దుయ్యబట్టారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే మా లక్ష్యం అని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో భట్టి విక్రమార్క ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలను, ఉద్యోగులను నిర్బంధించిన వారు.. ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వినే ఓపిక లేక సభ నుంచి వెళ్ళిపోవడం వారి అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న నాకు జరిగిన అవమానాలు రికార్డుల్లో స్పష్టంగా ఉన్నాయి. ప్రజల సమస్యల కోసం



మైక్ అడిగితే ఇవ్వని వారు, నేడు మేము ప్రతి అంశానికి సమాధానం ఇస్తామన్నా వినకుండా పారిపోతున్నారని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, తమ ఆలోచనలన్నీ ప్రజల అవసరాల చుట్టూనే తిరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని భట్టి తెలిపారు. ఏదైనా కారణంతో ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకూడదన్న ఉద్దేశంతో రూ. 1.20 కోట్ల ప్రమాద భీమా కల్పించామని, దీనివల్ల 7.50 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని వివరించారు. గతంలో ఉద్యోగులను హౌస్ అరెస్టులు చేసి, భయం భయంగా బతికించిన బీఆర్ఎస్ నేతలకు ఈ సంక్షేమం ఇష్టం లేకే సభను వీడారని విమర్శించారు. పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో బడికి రావద్దన్న ఆలోచనతో పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టామని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ అందించాలని నిర్ణయించామన్నారు. అంతేకాకుండా, ఇంటర్ విద్యార్థులకు కూడా మొట్టమొదటిసారి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయబోతున్నామని, ఈ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షం బడ్జెట్ కాగితాలు చించి చెవిలో పెట్టుకుని వెళ్ళిపోయారని ఎద్దేవా చేశారు. వ్యవసాయాన్ని పండుగ చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని చెబుతూ, ఉచిత విద్యుత్ అనేది కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు రూ. 14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని, గత ప్రభుత్వంలాగా ఓట్ల కోసం ఔటర్ రింగ్ రోడ్డును కుదువబెట్టి డబ్బులు పంచే సంస్కృతి తమది కాదని హితవు పలికారు. సన్నధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకుంటామని భరోసా ఇచ్చారు. మత, ప్రాంత భేదం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల ప్రమాద భీమా కల్పించామని, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, ఆర్టీసీ ఉచిత ప్రయాణం వంటి పథకాల కోసం రూ. 50 వేల కోట్లు కేటాయించామని భట్టి విక్రమార్క వివరించారు. వ్యక్తులుగా తాము చిన్నవాళ్ళం కావచ్చు కానీ, తాము చేపట్టిన ప్రజాస్వామ్య ప్రక్రియను మన్నించి చర్చలో పాల్గొనాల్సింది పోయి, 'ఆడలేక మద్దెలో ఓడు' అన్నట్టుగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఆయన ప్రసంగాన్ని ముగించారు.

# దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

మొదటి తరువాయి

చదువుల విషయంలో కానీ చాలా చాలా వాగ్దానాలు వారి అభయహస్తం మేనిఫెస్టోలో చాలా వివరంగా ఇచ్చారు. అవన్నీ కూడా మా సోదరుల దగ్గర చాలా వివరంగా వారి ఫోన్లలో, వారి మనసుల్లో ముద్రించుకొని పోయి ఉన్నయి. తెల్లారి లేస్తే శారీరకంగా అవస్థలు పడే దివ్యాంగులు కోరుతున్నది ప్రత్యేకంగా కొత్తగా ఏం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ పార్టీగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వారు ఇవాళ అసెంబ్లీలోకి రావాలని ప్రయత్నం చేశారు. నేనడిగాను అసెంబ్లీలో లోపలికి రానీయండి.. మా లెసిస్లేచర్ పార్టీ ఆఫీస్‌లో కలుద్దాం. వారు బయట రోడ్డు మీద కలవటం కరెక్టు కాదు. కానీ వీళ్లంతా వస్తే మాకేదో ఇబ్బంది అయితది. వాళ్లను వద్దు అని చెప్పి పాసులు కూడా ఇయ్యకుండా సతాయిస్తే వారిని నడిరోడ్డుమీద



కలవాల్సిన దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ మండిపడ్డారు. దివ్యాంగుల గురించి కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు పొంది గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని మేం ఈ బడ్జెట్ సెషన్‌లో అడుగుతాం.. నిలదీస్తాం. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదు. పక్క రాష్ట్రంలో రూ.6 వేల పెన్షన్ ఇస్తున్నరు. మీరు గద్దెనెక్కిన తర్వాత మూడో బడ్జెట్ ఇది 60 శాతం సమయం అయిపోయిన తర్వాత కూడా ఎందుకు ఇంకా డబ్బులు కేటాయించడం లేదు. నిలదీస్తాం. దీంతోపాటు దివ్యాంగులకు గతంలో మేం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇచ్చి ఆదుకునే ప్రయత్నం చేసినం. ప్రతీ దాంట్లో కోటా పెట్టి వారిని ఆదుకునే ప్రయత్నం చేశాం. భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ చేస్తాం. కానీ ఈ ప్రభుత్వం దివ్యాంగ సోదరసోదరీమణులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు. నేడు ఇందిరాపార్క్ దగ్గర వాళ్లు రిలే నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు దానికి కూడా మా మద్దతు ఉంటుంది. పార్టీ నాయకులం కూడా హాజరవుతాం. తప్పకుండా దాన్ని కూడా విజయవంతం చేయాల్సిందిగా దివ్యాంగ సోదరులను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

మొదటి తరువాయి

రాజకీయాల్లో తనది పూలబాట కాదని.. ముళ్ల బాట అని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ కాబట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి, సీఎల్పీ లీడర్ కాబట్టి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. కానీ తాను శాసన మండలిలో నేతను అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేశారు. మరి తనకెందుకు అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల్లో మనకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శం కాదు కదా? అంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన చరకలంటించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏమిటి? మనం చేస్తున్నదేమిటంటూ రాష్ట్రంలోని పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా నిలదీశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వంటి నేతలు ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకంటూ జీవన్ రెడ్డి ఈ సందర్భంగా కొంత అసహనం వ్యక్తం చేశారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని చెప్పారు. తాను పార్టీ వీడి వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారంటూ కాంగ్రెస్ ప్రతినిధుల రాకపై జీవన్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీని వీడొద్దని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర, 43 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి. ఆయన మాకు తండ్రిలాంటివారు. రాజకీయాల్లో ఆయన సీనియర్ నేత. జీవన్‌రెడ్డిని కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను వదలుకోదలచుకోలేదు. పార్టీ వీడే అంశంలో పునరాలోచన చేయాలని కోరాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. 'జీవన్ రెడ్డి మా తండ్రి సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అనే ఆశతో ఇక్కడి నుంచి వెళ్తున్నామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు.అయితే వారు ఎలాంటి హామీ ఇవ్వలేక పోయారు. దీంతో ఆయనకు సూచనలు చేసి వెనుదిరిగారు. పార్టీ మారడామా లేదా అన్నది కూడా తన చేతిలో లేదని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖయానించారు. ఇప్పటికే శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లు ఓమారు జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఇక ఈ భేటీ అంనంతరం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ చర్చలు ఫలించలేదు. జీవన్‌రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీని అభిమానులు తొలగించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది పరిష్కారం లేని సమస్యగా మారింది.. సమస్యకు పరిష్కారం నా దగ్గర లేదు.. వారి దగ్గర కూడా లేదు.

# వాయు కాలుష్య దేశంగా పాక్

ప్రపంచంలోనే అత్యంత వాయు కాలుష్య నగరం మన దేశంలోనే..

**న్యూఢిల్లీ,**

ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాలు, దేశాలకు సంబంధించిన జాబితా ఒకటి తాజాగా విడుదలైంది. గత ఏడాది అంచనాల ప్రకారం ప్రపచంలోనే అత్యంత వాయు కాలుష్య దేశంగా పాకిస్తాన్ నిలిచింది. ఇక ప్రపంచంలోనే అత్యంత వాయు కాలుష్య నగరంగా ఇండియాలోని చిన్న పట్టణమైన లోని నిలిచింది. ఇది ఉత్తర ప్రదేశ్, ఘజియాబాద్‌కు దగ్గర్లో ఉంటుంది. ఐక్యూఎయిర్ అనే స్విట్జర్లాండ్‌కు చెందిన సంస్థ 2025లో అత్యంత వాయు కాలుష్య దేశాలు, నగరాలకు సంబంధించి నివేదిక రూపొందించింది. ఈ జాబితాను మంగళవారం విడుదల



చేసింది. దీని ప్రకారం మొత్తం 143 దేశాల్లో వాయు కాలుష్యాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఇందులో 130 దేశాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన వాయు కాలుష్య ప్రమాణాల్లో విఫలమయ్యాయి. లోని నగరంలో పీఎం 2.5కి వాయు కాలుష్యం 112.5 మైక్రో గ్రామ్స్‌గా ఉంది. పీఎం 2.5 అంటే 2.5 మైక్రోమీటర్లకంటే తక్కువగా ఉన్న కాలుష్య రేణువులు అని అర్థం. ఇంత తక్కువగా ఉంటే అవి ముక్కు, శ్వాస ద్వారా లంగ్స్‌లోకి, రక్తంలోకి చొచ్చుకుపోగలవు. దీంతో ఆస్తమా, గుండె జబ్బులు వంటి అనారోగ్యాలు దరిచేరే అవకాశం ఉంది. లోని నగరం నేషనల్ క్యాపిటల్ రీజన్ (ఎన్‌సీఆర్) పరిధిలో ఉంది. చుట్టుపక్కల పరిశ్రమలు ఉండటం, వాహన కాలుష్యం కారణంగా ఇక్కడ పొల్యూషన్ పెరుగుతోంది. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యం కలిగిన దేశంగా పాకిస్తాన్ నిలిచింది. ఇక్కడ సాధారణ వాయు ప్రమాణాలకంటే 13 రెట్లు ఎక్కువ కాలుష్యం ఉంది. కాలుష్యం ఎక్కువగా ఉన్న రెండో దేశంగా పాకిస్తాన్, మూడో దేశంగా తజికిస్తాన్ ఉన్నాయి. మొత్తం 75 దేశాల్లో కాలుష్య స్థాయిలు తగ్గగా, 54 దేశాల్లో పెరిగాయి. 2024లో ప్రపంచంలోని నగరాల్లో 17 శాతం మాత్రమే వాయు ప్రమాణాలను అందుకోగా, 2025లో ఈ సంఖ్య 14 శాతానికి తగ్గింది.

# లోక్‌సభ సీట్ల పెంపు..

మొదటి తరువాయి

తెలంగాణలో ప్రస్తుతం 17 ఎంపీ స్థానాలుండగా, వీటి సంఖ్య 26కు చేరనుంది. ఎంపీ సీట్లకు సంబంధించి ఏ రాష్ట్రానికి ఎన్ని స్థానాలు దక్కుతాయో చూద్దాం. యూపీలో ప్రస్తుతం ఉన్న 80 ఎంపీ సీట్లు 120కి, మహారాష్ట్రలో 48 నుంచి 72కు, పశ్చిమ బెంగాల్‌లో 42 నుంచి 63కు, బిహార్‌లో 40 నుంచి 60కి, మధ్యప్రదేశ్‌లో 29 నుంచి 44కు, రాజస్థాన్‌లో 25 నుంచి 38కి, గుజరాత్‌లో 26 నుంచి 39కి, ఒడిశాలో 21 నుంచి 32కి, ఝార్ఖండ్‌లో 14 నుంచి 21కి, అసోంలో 14 నుంచి 21కి, పంజాబ్‌లో 14 నుంచి 21కి, ఛత్తీస్‌గఢ్‌లో 11 నుంచి 17కు, హరియాణాలో 10 నుంచి 15కు, ఢిల్లీలో 7 నుంచి 11కు, జమ్మూ-కాశ్మీర్‌లో 5 నుంచి 8కి, ఉత్తరాఖండ్‌లో 5 నుంచి 8కి సీట్లు, హిమాచల్ ప్రదేశ్‌లో 4 నుంచి 6కు, గోవాలో 2 నుంచి 3 సీట్లకు పెరగనుండగా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, మిజోరం, మణిపూర్, త్రిపుర, మేఘాలయ రాష్ట్రాలు అన్నింట్లో రెండేసి సీట్లుండగా, ఇప్పుడు 3 సీట్లు అవుతాయి. అంటే కేంద్ర పాలిత ప్రాంతాలు, చిన్న రాష్ట్రాల్లో ఇప్పటిదాకా 20 ఎంపీ సీట్లుండగా, ఇకపై 30 సీట్లు అవుతాయి. ఇక దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి తెలంగాణలో 17 నుంచి 26కు, తమిళనాడులో 39 సీట్లుండగా 59కి, కర్ణాటకలో 28 సీట్లుండగా 42కు, ఏపీలో 25 సీట్ల నుంచి 38కి, కేరళలో 20 నుంచి 30కి పెరుగుతాయి. అలాగే నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు కూడా వర్తిస్తాయి. ఇప్పటివరకు లోక్‌సభలో 84 ఎస్సీ రిజర్వుడ్ సీట్లుండగా వీటి సంఖ్య 126కు పెరగనుంది. అలాగే, 47 ఎస్టీ సీట్లుండగా, 70 సీట్లకు పెరగనుంది. 2011 నాటి జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుని సీట్ల సంఖ్యను కేంద్రం పెంచబోతుంది. దీనికి సంబంధించిన సవరణ బిల్లును కేంద్ర త్వరలోనే పార్లమెంట్‌లో ప్రవేశబెట్టబోతుంది.

## ఇరాన్‌తో యుద్ధం వేళ మోదీకి ట్రంప్ ఫోన్..

మొదటి తరువాయి

ట్రంప్‌తో చర్చలపై మోదీ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. ట్రంప్ నుంచి కాల్ అందుకున్నట్లు, పశ్చిమాసియా ఉద్రిక్తతలపై చర్చించినట్లు తెలిపారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు, శాంతి స్థాపనకు ఇండియా ఎప్పుడూ మద్దతుగా ఉంటుందని మోదీ అభిప్రాయపడ్డారు. అలాగే, హార్ముజ్ జలసంధిని తెరిచి, ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉంచడం అవసరమని పేర్కొన్నారు. ఈ అంశంలో స్థిరత్వం, శాంతికి ఎప్పుడూ అందుబాటులో ఉంటామని ట్రంప్‌నకు మోదీ తెలిపారు. హార్ముజ్ జలసంధిలో అడ్డగింత అంగీకరించదగింది కాదని మోదీ అంతకుముందు పార్లమెంట్‌లో అన్నారు. వాణిజ్య నౌకలపై దాడి చేయడం సరికాదన్నారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా భారత నౌకల్ని సురక్షితంగా తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఇరాన్‌పై ఐదు రోజులపాటు దాడులు ఆపేస్తామని ట్రంప్ పేర్కొన్న మరుసటి రోజే ప్రధాని మోదీకి ఫోన్ చేయడం విశేషం.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బాంబు బెదిరింపు మెయిల్

మొదటి తరువాయి

డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయపడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.

## క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు

మొదటి తరువాయి


హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

## లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత పాపారావు..

ఒడిశాలో మరో నేత సరెండర్..!

**న్యూఢిల్లీ,**

: మావోయిస్టు అగ్రనేత పాపారావ అలియాస్ సున్నం చంద్రయ్య లొంగిపోయారు. తన అనుచరులతో కలిసి ఆయన బీజాపూర్ ఎస్పీ ఎదుట సరెండర్ అయ్యారు. ఆయనతో పాటు లొంగిపోయిన 17మందిలో.. 10 మంది పురుషులు, 8 మంది మహిళా మావోయిస్ట్‌లు ఉన్నారు. వీరినుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మరో కీలక నేత సుక్రు సైతం ఒడిశాలో లొంగిపోయారు.ఆపరేషన్ కగార్ ఉధృతమవ్వడం, లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వాలు పునరావాసం కల్పిస్తున్న నేపథ్యంలో కీలక నేతలు జనం వీడుతున్నారు. ఇప్పటికే పలువరు కీలక నేతలు జనజీవన స్రవంతిలో కలవగా బస్తర్‌కు చెందిన పాపారావు కూడా లొంగిపోయారు. ఆయనపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. పావార 50కి పైగా ఏసులు 76 మంది భద్రతా సిబ్బంది హత్యలో పాపారావు హస్తముంది.సుక్మా జిల్లా కలెక్టర్ కిడ్నాప్ కేసులోనూ ఆయన పాత్ర ఉంది. ఒడిశాలో లొంగిపోయిన సుక్రుపై రూ.55 లక్షల రివార్డు ఉంది.



## రామాయంపేట భూనిర్వశితుల కు న్యాయం చేయండి



**రామాయంపేట – మార్చి 24 (మహా ప్రభ)**
మెదక్ ఎల్కతుర్తి జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంలో భూములను కోల్పోతున్న. రామాయంపేట రైతులు మంగళవారం మెదక్ ఆర్ డి ఓ కు వినతిపత్రం సమర్పించారు గతంలో  ఇచ్చిన నోటీసుల ప్రకారం తమకు సరైన నష్టపరిహారం అందడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత. రిజిస్ట్రేషన్ విలువల ప్రకారం నష్టపరిహారం చెల్లించి తమకు న్యాయం చేయాలని రామాయంపేట రైతులు విలువైన భూములను కోల్పోతున్నామని కనుక మాకు సరైన నష్టపరిహారం ఇప్పించగలరని కోరుకుంటు నారు

## ఈనెల 30న తై బజార్ వేలం పాట

-ఆసక్తి కలవారు డిపాజిట్ చేయాలి




**దుబ్బాక – మార్చి 24 (మహా ప్రభ)**
దుబ్బాక పట్టణానికి చెందిన తై బజార్ వేలంపాట ఈనెల 30 సోమవారం రోజున నిర్వహిస్తున్నట్లు దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వేలం పాటలో పాల్గొనేవారు 25 వేల డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆయన అన్నారు. అంతేకాకుండా వేలంపాటలో వచ్చినవారు, ఆరు నెలల డబ్బులు ఇవ్వాలని, అంతేకాకుండా బ్యాంకు చెక్కును ఇవ్వాలన్నారు, ఈనెల 30 సోమవారం రోజున ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ సంఘం మెదక్ జిల్లా(టాస్కా).




**మెదక్ జిల్లా – మార్చి 24 (మహా ప్రభ)**
అంతర్జాతీయ మహిళా దినోత్సవము మండల పరిషత్ కార్యాలయం మెదక్ లో సమావేశ మందిరము నందు టాస్కా జిల్లా అధ్యక్షులు శివ కృష్ణమూర్తి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సమావేశం నిర్వహించబడినది . ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంక్షేమ అధికారిని  హేమ భార్గవి స్థానిక మండల పరిషత్ అధికారిని లక్ష్మీ విచ్చేసినారు. వీరితోపాటు టాస్కా రాష్ట్ర కార్యదర్శి టి. రాజేశ్వర్ మరియు టాస్కా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపర్తి వెంకటేశము వేదికను అలంకరించినారు. ముఖ్య అతిథి హేమ భార్గవి కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యతను న్యూక్లియర్ ఫ్యామిలీ గురించి మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విశిష్టతలను తెలిపినారు. మహిళా సాధికారత గురించి మాట్లాడుతూ ఆర్థిక సామాజిక రాజకీయ రంగాలలో మహిళా శక్తిని బలోపేతం చేయాలని చెప్పారు. ప్రధాన నిర్ణయాల్లో మహిళా లను భాగస్వాములు చేయాలని అన్నారు ఈ సమావేశానికి మహిళలు సీనియర్ సిటిజన్స్ ప్రణామ్ డే కేర్ సిబ్బంది  అంజలి సతీష్  మరియు శ్రీధర్ కుమార్ గారు పాల్గొన్నారు వేదిక పైనున్న మహిళాఅధికారులను మరియు సమావేశమునకు వచ్చిన మహిళలకు టాస్కా తరపున సన్మానం చేయడం జరిగింది.

## పీఐబీ, సీబీసీ హైదరాబాద్ ఏడీజీతో సమావేశమైన పీఐబీ భువనేశ్వర్ నేతృత్వంలోని మీడియా ప్రతినిధి బృందం

నాలుగు రోజుల మీడియా పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు చేరుకున్న పీఐబీ భువనేశ్వర్ నేతృత్వంలోని మీడియా ప్రతినిధి బృందం



**హైదరాబాద్ – మార్చి 24 (మహా ప్రభ)**
హైదరాబాద్ అధికారిక మీడియా పర్యటనలో భాగంగా భువనేశ్వర్‌లోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) నేతృత్వంలోని మీడియా ప్రతినిధి బృందం.. హైదరాబాద్‌లోని పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) శ్రుతి పాటిల్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశం సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో భాగస్వామ్య వ్యూహాలకు ఉన్న ప్రాముఖ్యతను శ్రుతి పాటిల్ చెప్పారు. 2026 మార్చి 24 నుంచి మార్చి 27 వరకు జరగనున్న ఈ నాలుగు రోజుల మీడియా పర్యటనలో భువనేశ్వర్ నుంచి వచ్చిన 11 మంది సభ్యుల బృందం పాల్గొంటుంది. కేంద్ర ప్రభుత్వ కీలక కార్యక్రమాల గురించి పాత్రికేయులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడంతో పాటు హైదరాబాద్‌లోని సాంస్కృతిక వైభవం, వారసత్వం, మౌలిక సదుపాయాల వృద్ధిని తెలియజేసే ఉద్దేశంతో ఈ పర్యటన చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్‌లోని ఎన్?ఐఈపీడీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిసేబిలిటీస్), విద్యానగర్‌లోని ఎన్ఎస్‌టీఐ (నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) వంటి ప్రతిష్టాత్మక సంస్థల సందర్శనలు కూడా ఉన్నాయి. ఇవి సామర్థ్య పెంపు, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సాధికారత కార్యక్రమాలపై లోతైన అవగాహనను కల్పిస్తాయి.

## ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లికి కృతజ్ఞతలు తెలిపిన నెరా రాష్ట్ర వ్యవస్థాపక కమిటీ

- జర్నలిస్టుల హక్కుల సాధనకు నిరంతర కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ



**హైదరాబాద్ -- మార్చి 24 (మహా ప్రభ)**
శాసనమండలిలో జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుకు న్యూస్ పేపర్స్ ఎడిటర్స్ రైట్స్ అసోసియేషన్ (నెరా) రాష్ట్ర వ్యవస్థాపక కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయి ఆయనకు శాలువా కప్పి యూనియన్ మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల హక్కుల సాధన కోసం తన గొంతు వినిపిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలపై సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మండలిలో జర్నలిస్టుల సమస్యల ప్రస్తావన

ఈ నెల 18న శాసనమండలిలో సుమారు ఆరు నిమిషాల పాటు మాట్లాడిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు జర్నలిస్టుల వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా పలు కీలక అంశాలను ప్రస్తావించారు. సమాజానికి కళ్లుగా, చెవులుగా పనిచేసే జర్నలిస్టులకు తగిన గుర్తింపు లేకపోవడం, భద్రతా లోపాలు, ఆర్థిక అస్థిరత వంటి సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. రోజంతా ప్రజా సమస్యలపై పనిచేసే జర్నలిస్టులు తక్కువ వేతనాలతో కుటుంబ పోషణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ఫ్రీలాన్స్, చిన్న పత్రికలు మరియు వెబ్ మీడియా జర్నలిస్టులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు.

సంక్షేమ చర్యలపై సూచనలు

జర్నలిస్టులకు ఆరోగ్య బీమా పథకాలు అందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని, క్యాష్‌లెస్ వైద్యం అందుబాటులోకి తేవాలని సూచించారు. హౌసింగ్ సైట్లు, పెన్షన్, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలను విస్తరించాలని కోరారు.

జర్నలిస్టులపై పెరుగుతున్న దాడుల నేపథ్యంలో భద్రత కోసం కఠిన చట్టాలు అవసరమని పేర్కొన్నారు. అక్రిడేషన్ వ్యవస్థలో ఫీల్డ్, డెస్క్ జర్నలిస్టులకు సమాన అవకాశాలు కల్పించాలని, గడువులను పొడిగించి అర్హులందరికీ న్యాయం చేయాలని సూచించారు.

మహిళా జర్నలిస్టులకు 33 శాతం రిజర్వేషన్, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు గుర్తింపు, రైల్వే-- బస్సు పాస్ సౌకర్యాలు కల్పించాలని ప్రతిపాదించారు. జర్నలిస్టులు ప్రత్యేక మాన్యాలు కోరడం లేదని, కనీస భద్రత మరియు సంక్షేమం మాత్రమే ఆశిస్తున్నారని తెలిపారు.

**నెరా -- ఎమ్మెల్సీ మాట ముచ్చట**

మంగళవారం జరిగిన భేటీలో నెరా రాష్ట్ర అధ్యక్షుడు, ఓపెన్ ఫ్రేమ్ ఎడిటర్ కట్టా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షుడు సెగ్గెం కిరణ్ కుమార్, కోశాధికారి ఎస్‌బిఎన్ చారి పాల్గొన్నారు. సుమారు 40 నిమిషాల పాటు జరిగిన సమావేశంలో జర్నలిస్టులు, పత్రిక ఎడిటర్లు ఎదుర్కొంటున్న వృత్తి సమస్యలు మరియు సంక్షేమ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

జర్నలిస్టుల సమస్యలపై సమగ్ర నివేదిక తయారు చేసి ఐఅండ్‌పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అందించాలని ఎమ్మెల్సీ సూచించారు. సమస్యల పరిష్కారానికి మంత్రి స్థాయిలో చర్చలు జరుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

అనంతరం నెరా రాష్ట్ర కమిటీ తరపున ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తమ పోరాటం కొనసాగుతుందని నెరా ప్రతినిధులు తెలిపారు.

## జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ వైఖరి సరైంది కాదు....!

-ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైనం



**దుబ్బాక -- మార్చి 24 (మహా ప్రభ)**
జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణికి నిరసనగా టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తలపెట్టిన చలో సమాచార భవన్ కార్యక్రమానికి జర్నలిస్టు మిత్రులందరికీ భారీ సంఖ్యలో తరలిరావాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్తు మహిపాల్ రెడ్డి మంగళవారం తెలిపారు. హలో జర్నలిస్ట్..... చలో హైదరాబాద్ అనే నినాదంతో కలం గళం ఒక్కటై జర్నలిస్టులంతా కథలాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలని, చిన్న మధ్యతరహా పత్రికల అడ్వర్టైజ్మెంట్ బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలంటూ, అక్రిడేషన్ కార్డులు, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని, చిన్న మధ్య తరహా పత్రికలను ఎశీపానల్ మెంట్ జాబితాలో చేర్చాలని పలు డిమాండ్లతో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. అభివృద్ధిలో మెదక్ ముందుకు.

ఎమ్మెల్యే రోహిత్ రావు



**పాపన్నపేట.– మార్చి 24 (మహా ప్రభ)**
పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. మంగళవారం  పొడ్చన్ పల్లి గ్రామంలో 48 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం పాపన్నపేట లోని  ఆయా గ్రామాల లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్,సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ అభివృద్ధిలో మెదక్ నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం,తహసీల్దార్ సతీష్ కుమార్,ఎంపీడీఓ విష్ణువర్ధన్,హౌసింగ్ పీడీ మాణిక్యం,డీఈ ప్రసన్న,ఏఈ అరుణ్ ప్రసాద్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్,పాపన్నపేట,పొడ్చన్ పల్లి, కుర్తివాడ సర్పంచులు పావని నరేందర్ గౌడ్,ఏసు,చెట్టుకింది శ్రీధర్,నాయకులు ప్రభాకర్ రెడ్డి,శెట్టి శ్రీకాంత్,ప్రశాంత్ రెడ్డి,గౌస్,ఖలీమ్,నాని,సూఫి,ప్రేమ్ రాథోడ్ ,సద్దామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష



**తాడ్వాయి – – మార్చి 24 (మహా ప్రభ)**
డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు తాడ్వాయి పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం సోమారం తండాకు చెందిన సభావత్ రాజు (32) మద్యం సేవించి వాహనం నడిపినట్లు గుర్తించారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి టీ. చంద్రశేఖర్ నిందితుడికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

# అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం

-వేణుంబాకలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



**మార్చ్ 24 తిరుపతి జిల్లా (దొరవారి సత్రం) మహాప్రభ**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. దొరవారి సత్రం మండలం వేణుంబాక గ్రామంలో మంగళవారం జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రైతులతో సమావేశమై వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మార్చి 13న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మూడవ విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశారని,గత వైసిపి ప్రభుత్వం రైతులకు కేవలం 13,500 ఇస్తే, చంద్రబాబు నాయుడు ఆ సాయాన్ని రూ. 20 వేలకు పెంచారని గుర్తుచేశారు. దీనివల్ల సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 26,526 మంది రైతులకు అదనంగా రూ. 17.24 కోట్ల లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే విజయశ్రీ వివరించారు. సొంత భూమి లేని కౌలు రైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వమే సొంత బడ్జెట్ నుంచి పూర్తి రూ. 20 వేలు అందిస్తుందని భరోసా ఇచ్చారు.

# క్షయ వ్యాధి ప్రమాదకరం కాదు

సులువుగా తగ్గించుకోవచ్చు: అధ్యక్షురాలు పందిరి జ్యోతి




**దేవరకొండ మార్చి 24( మహాప్రభ )**
దేవరకొండ నియోజకవర్గం లోని చందంపేట ప్రైమరీ హెల్త్ సెంటర్లో మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వాసవి వనిత గ్రేటర్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి మాట్లాడుతూ పూర్వం లాగా క్షయ వ్యాధి ఇప్పుడు ప్రమాదకరం కాదని సులభంగా తగ్గించుకోవచ్చని తెలిపారు, ఈ సందర్భంగా క్లబ్ తరపు నుండి 10 టీవీ మెడికల్ కిట్స్ పంపిణీ చేయమన్నామని తెలిపారు, మెడికల్ క్యాంపులకు వచ్చిన రోగులకు, వైద్యులకు, మెడికల్ సిబ్బంది కి, వాటర్, బిస్కెట్స్, తేనీరు అందజేశామని తెలిపారు, ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా డి ఎం హెచ్ ఓ, డిప్యూటీ డిఎంహెచ్వో, చందంపేట మెడికల్ ఆఫీసర్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ గోవిందు కొండయ్య, మాధవి, కార్యదర్శి బెజవాడ మల్లేశ్వరి, కోశాధికారి అలంపల్లి శిరీష, కుంచకూరి సంధ్యారాణి, మెడికల్ సిబ్బంది శ్యామ్, వాసవి వనిత సభ్యురాలు పాల్గొన్నారు

# అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు

-ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
-ప్రజా సమస్యలు పరిష్కరించడకుండా అణిచివేయడం దారుణం
-ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలు 420 హామీ అమలు చేయాలి
-బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు,బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ




**దేవరకొండ మార్చి 24( మహాప్రభ )**
అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు అని బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు,బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ లు అన్నారు.మంగళవారం అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బిఆర్ ఎస్వీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ......ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి అని ఆయన వారు డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలు పరిస్కరించడకుండా అణిచివేయడం దారుణం అని ఆయన అన్నారు.ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలు 420 హామీ అమలు చేయాలి అని డిమాండ్ చేశారు.అరెస్టు అయిన వారిలో కౌన్సిలర్ పొట్ట మధు,నేనావత్ నాగార్జున,తదితరులు ఉన్నారు.

# 4నఅసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్య విరుద్ధం: ఇరగదిండ్ల కృష్ణ




**దేవరకొండ – మార్చి 24 (మహా ప్రభ)**
తమ సమస్యల పరిష్కారం కోసం నేడు తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరుతున్న తరుణంలో, పోలీసులు ముందస్తు అరెస్టులకు పాల్పడటం అన్యాయమని దేవరకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ తీవ్రంగా ఖండించారు.మంగళవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో ఇరగదిండ్ల కృష్ణ తన నివాసం నుండి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతుండగా, పోలీసులు అక్కడికి చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సుమారు గంట సేపు స్టేషన్‌లోనే ఉంచి, ఆయన వివరాలు నమోదు చేసుకుని, ఫోటోలు తీసుకున్న అనంతరం విడుదల చేశారు.ఈ సందర్భంగా ఇరగదిండ్ల కృష్ణ మాట్లాడుతూ...?"శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోంది."
"ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనీయకుండా పోలీసుల ద్వారా అణచివేయడం సరికాదు." "ముందస్తు అరెస్టులతో మా పోరాటాన్ని ఆపలేరు. మా హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తాం."ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

# మున్సిపల్ సిబ్బందికి రూ. 26.000, రెగ్యులర్ చేయాలని డిమాండ్

సిఐటియు నాయకులు : వెంకటయ్య



**దేవరకొండ మార్చి 24 ( మహాప్రభ )**
దేవరకొండ మున్సిపల్ పరిశుద్ధ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మంగళవారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరారు, సిఐటియు నాయకుడు నల్ల వెంకటయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు, నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26 వేలకు పెంచి ప్రభుత్వం కోరారు.

# ప్రభుత్వ భూములను రక్షించండి ఎం ఆర్ ఓ కు వినతి పత్రం.




**సరూర్ నగర్ – మార్చి 24 (మహా ప్రభ)**
కొత్తపేట డివిజన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, వాటికి తక్షణం ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ఉప్పల్ మండల్ ఎం ఆర్ ఓ పూల్ సింగ్ చౌహాన్ వినతిపత్రం సమర్పించారు,ప్రభుత్వ భూములు ప్రజల అవసరాల కోసం కేటాయించ బడినవిగా ఉండటంతో,వాటిని అక్రమ ఆక్రమణల నుండి రక్షించడం చాలా అవసరం. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూములను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్ లో ప్రజా ప్రయోజనాల కోసం వాటిని సంరక్షించలీ పవన్ కుమార్ పేర్కొన్నారు అదేవిధంగా, ఈ సమస్యను ప్రాధాన్యంగా పరిగణించి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు ఇవ్వాలని కూడా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వెంకట్ రెడ్డి , తిరుమల , వీరా రెడ్డి , నాయకోటి ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఆమోదించడం హర్షణీయం

- లాయర్స్ ఫోరం అధ్యక్షుడు న్యాయవాది నర్రి స్వామి



**ఎల్.బి నగర్ – మార్చి 24 (మహా ప్రభ)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము న్యాయవాదులకు రక్షణ చట్టాలను ఏర్పాటు చేస్తామని చట్టాన్ని ఆమోదించడం హర్షనీయమని తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు,, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి తెలియజేశారు గత కొన్ని సంవత్సరాలుగా న్యాయవాదుల కోసం రక్షణ చట్టాలు ఏర్పాటు చేయాలని అనేకమైనటువంటి ఉద్యమాలు నిర్వహించడం జరిగింది అందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ చట్టాలను ఏర్పాటు చేస్తూ చట్టాన్ని ఆమోదించడం చాలా గర్వకారణం చట్టాన్ని ప్రాణాలు అర్పించిన న్యాయవాదులకు అంకితం చేయాలని తెలియజేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో అనేకమంది న్యాయవాదులు పాల్గొన్నారు.

# తాడ్వాయిలో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం



**తాడ్వాయి, మార్చి 24(మహాప్రభ)**




మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో ఎస్సై నరేష్, తాడ్వాయి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలకు పెరుగుతున్న సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఓటీపీ మోసాలు, అనుమానాస్పద యాప్‌ల ద్వారా జరిగే మోసాలు, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల హ్యాకింగ్, డిజిటల్ చెల్లింపుల మోసాల గురించి వివరించారు. అజ్ఞాత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంక్ సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, యాప్‌లను డౌన్‌లోడ్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.సమాజంలో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించి, అప్రమత్తతతో ఉంటే మోసాలను నివారించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# ఏప్రిల్ 15 నుండి ప్రత్యేక బృందాలతో భూముల సర్వే





- అర్హులైన రైతులకు 'భూ భారతి' ద్వారా పట్టాల పంపిణీ
- పాఠశాలలు, అంగన్‌వాడీల తనిఖీ
- మౌలిక వసతుల కల్పనకు ఆదేశం

**దేవరకొండ మార్చి 24( మహాప్రభ )** దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ గారు భరోసా ఇచ్చారు. సుమారు పది సంవత్సరాల తర్వాత ఒక జిల్లా స్థాయి అధికారి ఈ ప్రాంతాన్ని సందర్శించడం విశేషం. మంగళవారం ఆయన దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి మరియు ఇతర జిల్లా అధికారులతో కలిసి పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు.గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పొగిళ్లలోని సర్వే నంబర్ 2లో ఉన్న సుమారు 1056 ఎకరాల భూమికి సంబంధించి గతంలో జరిగిన రికార్డుల పొరపాట్లను సరిదిద్దుతామని తెలిపారు.కంబాలపల్లిలో ప్రస్తుతం జరుగుతున్న మోకా సర్వే పూర్తి కాగానే, ఏప్రిల్ 15 నుండి పొగిళ్లలో ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహిస్తాం.సర్వే అనంతరం రైతుల జాబితాను గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డులో ప్రదర్శించి, అభ్యంతరాలను స్వీకరిస్తాం. విచారణ అనంతరం అర్హులైన ప్రతి రైతుకు 'భూ భారతి' ద్వారా కొత్త పట్టా పాస్ పుస్తకాలు అందజేస్తాం.అటవీ భూముల సమస్యలపై రెవెన్యూ మరియు ఫారెస్ట్ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించాలని తహసీల్దార్ శ్రీధర్ బాబును ఆదేశించారు.కలెక్టర్ పొగిళ్ల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం మరియు పల్లె దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న అదనపు గదులు, కిచెన్ షెడ్లు, తాగునీటి పనులను తక్షణమే పూర్తి చేయాలని, ఇందుకోసం 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ' ద్వారా తీర్మానాలు పంపాలని డిఈఓను ఆదేశించారు. విద్యార్థులతో ముచ్చటించి, వారి

# దేవరకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా 'జాబ్ మేళా'

-నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం: ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి



**దేవరకొండ మార్చి 24( మహాప్రభ )**
దేవరకొండలోని ఎం.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే ఉద్దేశంతో ఈరోజు భారీ జాబ్ మేళా నిర్వహించారు. తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టాస్క్) సహకారంతో ప్రముఖ ఫార్మా సంస్థ 'ఎం.ఎస్.ఎన్ (మీచీ) లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్' వారి సౌజన్యంతో ఈ నియామక ప్రక్రియ విజయవంతంగా కొనసాగింది.ఎం.ఎస్.ఎన్ సంస్థలో 'ప్రొడక్షన్ ట్రైనీ' పోస్టుల భర్తీ కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు.దేవరకొండ డివిజన్ పరిసర ప్రాంతాల నుండి దాదాపు 100 మందికి పైగా నిరుద్యోగ యువత ఈ మేళాకు హాజరయ్యారు.ఎల్ఐసి దేవరకొండ సీనియర్ మేనేజర్ రాము చౌహన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ...విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని కెరీర్‌లో స్థిరపడాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి మాట్లాడుతూ... విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా, ఉపాధి మార్గాలను చూపేందుకు కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను త్వరలోనే ఎం.ఎస్.ఎన్ సంస్థ ప్రతినిధులు ప్రకటిస్తారని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. కోటయ్య, టీఎస్ కేసి కోఆర్డినేటర్ సి. లింగమయ్య, మెంటర్ ఆర్. శివకృష్ణ, వి. యాదయ్య, ఇతర అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ బడ్జెట్లో విద్యా రంగాన్ని 20శాతం నిధులు కేటాయించాలి

-గతంలో పెండింగ్ లో ఉన్న బెనిఫిట్స్ విడుదల చేయాలి
-టీపిటిఎఫ్ డిమాండ్
-కలెక్టరేట్ ఎదుట ఆందోళన



**మెదక్ జిల్లా -24మార్చ్ (మహాప్రభ )**
విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని పదే పదే చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఈ బడ్జెట్లో 8.2 శాతం మాత్రమే కేటాయించి ఈ రాష్ట్ర ప్రజలను మళ్లీ ఒకసారి నిరాశ పరిచిందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టిపిటిఎఫ్)మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొంగోటి యాదగిరి, పి. వెంకట్రామి రెడ్డి లు ఆరోపించారు. మంగళవారం ప్రభుత్వ నిరంకుశ వైఖరి ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనల్లో భాగంగా మంగళవారం కలెక్టరెట్ ఎదుట ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ
ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లుగా విద్యారంగానికి 20 శాతం గానీ, తెలంగాణ విద్యా కమిషన్ సూచించినట్లు 18 శాతం గాని, కనీసం కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టో లో ప్రకటించినట్లుగా 15 శాతం కూడా బడ్జెట్ లో ప్రకటించక పోవడం వలన ప్రభుత్వ మాటలకు చేతలకు పొంతన లేదని అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రైమరీ తరగతుల నిర్వహణ, విద్యార్థుల కిట్, బ్రేక్ ఫాస్ట్ పథకాలను ఈ విద్యా సంవత్సరం నుండి ప్రవేశపెట్టడం జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని,ఇంత తక్కువ బడ్జెట్ల్ కారణంగా పథకాలు ప్రకటనలకే పరిమితం అయ్యే ప్రమాదం లేకపోలేదన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీ లాంటివి మాట మాటకు పేర్కొనే ముఖ్యమంత్రి ఇంత తక్కువ బడ్జెట్ లో వాటిని ఏ విధంగా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో విద్యారంగ కేటాయింపులపై పున:పరిశీలన చేసి మానవ వనరుల అభివృద్ధికి కీలక పాత్ర పోషించే విద్యారంగానికి అధిక బడ్జెట్ కనీసం 15 శాతం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని,పిఆర్సిని వెంటనే ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. రెగ్యులర్ డీఈఓ పోస్టులను మంజూరు చేయాలన్నారు. ఏంఈఓ, డైట్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.పూర్వప్రాథమిక పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.పెండింగ్లో ఉన్న డి. ఏ లను విడుదల చేయాలని,రిటైర్డు ఉద్యోగ,ఉపాధ్యాయుల బకాయిలను ఏక కాలంలో చెల్లించాలన్నారు. డైట్లలోని లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని,అన్ని జిల్లాలను ఇఎల్టిసి కేంద్రాలను ప్రారంభించి ఆంగ్లభాష నైపుణ్యాలను పెంపొందించాలన్నారు.అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రంను కలెక్టరేట్ కార్యాలయ ఏఓ యూనిస్ కు అందజేశారు.ఈ ఆందోళన కార్యక్రమంలో టీపిటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండల్ రెడ్డి,రాష్ట్ర పూర్వ కార్యదర్శి రామ్ కిషన్, మాజీ మండల విద్యాధికారి నీల కంఠం జిల్లాఉపాధ్యక్షులు గోపాల్,యాదగిరి బొమ్మర్తి, మొయిజోద్దీన్,శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు సాయి బాబా,రాజయ్య,దేవి సింగ్ సురేందర్,శ్రీనివాస్ జాదవ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సంగయ్య,హీరా లాల్ రాజేంద్ర ప్రసాద్,సంగీత నజీరోద్దీన్,అల్వాల్ రమేష్ రాష్ట్ర అకడమిక్ సభ్యులు మధు సూదన్,శశిధర్ రెడ్డి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జె. రామ్ చంద్రం,ముత్యాలు వివిధ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిండి నాగరాజు , నర్సింగం,చాంద్ పాషా, మహ్మద్ అమీరుద్దీన్, కిరణ్ కుమార్, మల్లేశం, చౌదరి మాధవ్, రాజశేఖర్, మురళి, శ్రీనివాస్ నాగభూషణం, కమ్మరి శ్రీనివాస్, రమేష్, కొమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పండిట్ దీనదయల శిక్షణ







**మార్చి 24 మేడ్చల్ జిల్లా (మహా ప్రభ)**
భారతీయ జనతా పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి అర్బన్ జిల్లా పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాబియాన్ కూకట్పల్లి నియోజకవర్గం -2026 కార్యశాల ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్నా తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్ర రావు మాట్లాడుతూ మోడీ గారు 370 ఆర్టికల్, త్రిబుల్ తలా క్ ,జమ్ము కాశ్మీర్ భారతదేశంలో సంపూర్ణంగా విలీనం చేయటం దశాబ్దములుగా బిజెపి మ్యానిఫెస్టోలో కీలకమైన వాగ్దానము లుగా ఉండేవి, మన మేనిఫెస్టోలో ఉన్న విధంగా చేశారని కొనియాడారు. రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో , పార్టీ కోసం పనిచేసిన వాళ్లకి, తగిన ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో నిజాంబాద్ జిల్లా మరియు కూకట్పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ మాధవరం కాంతారావు , ఓఎస్ రెడ్డి , కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.

# సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ ఆత్మ బలిదాన దివస్

**కామారెడ్డి జిల్లా మార్చి 24:(మహాప్రభ)**
ఢిల్లీలో నిర్వహించనున్న "చలో ఢిల్లీ" కార్యక్రమానికి గౌడ సోదరులు పెద్ద ఎత్తున తరలిరావాలని జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి గౌడ్, పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 2న ఢిల్లీలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 316వ ఆత్మ బలిదాన దివస్‌ను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుండి గౌడ సోదరులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు శేఖర్ గౌడ్, ఎల్లారెడ్డి యూత్ ఇంచార్జ్ ప్రశాంత్ గౌడ్, దేవేందర్ గౌడ్, సర్దార్ భూపతి గౌడ్, సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమానికి గౌడ సోదరులు తరలిరావాలని జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా



అధ్యక్షులు మురళి గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 2వ తేదీన ఢిల్లీలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 316వ ఆత్మ బలిదాన దివస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గౌడ సోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు శేఖర్ గౌడ్, ఎల్లాడి యూత్ ఇంచార్జ్ ప్రశాంత్ గౌడ్ దేవేందర్ గౌడ్, సర్దార్ భూపతి గౌడ్, సురేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ.



**మెదక్ జిల్లా -24మార్చ్ (మహాప్రభ )**
తెలంగాణ ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ 2026 క్యాలెండర్ ను జిల్లా పంచాయితీ కార్యాలయంలో మెదక్ జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల పోరం జిల్లా అధ్యక్షులు జంగం నగేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కుంచెం సంతోష్, రాష్ట్ర నాయకులు గడ్డ రాజు, సహాయక కార్యదర్శి రాజం ప్రసాద్ , ప్రచార కార్యదర్శి భాను కుమార్, తూప్రాన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహేశ్వరి మరియు నవనీత తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

### 1,372 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. నిఫ్టీ 445 పాయింట్లు లాభం



: భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాల్లో ముగిశాయి. మధ్యాహ్నం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1,372 పాయింట్లు (1.89 శాతం) పెరిగి, 74,068 వద్ద ముగిసింది. అలాగే నిఫ్టీ 445 పాయింట్లు పెరిగి 22,957.80 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఒక దశలో 1700 పాయింట్లు పెరిగింది. నిఫ్టీ కూడా ఒక దశలో 23000 దాటింది. 30 షేర్ బీఎస్ఈ సెన్సెక్స్‌లో ఇండిగో, ఎల్ అండ్ టీ, ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, ఏసియన్ పెయింట్స్, పవర్ గ్రిడ్, లాగార్డ్ భారీ లాభాలు పొందాయి. హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు 1.1 శాతం పెరిగాయి. అంతకుముందు మూడు సెషన్లలో కలిపి హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు 11.7 శాతం తగ్గి, రూ 1,35,000 కోట్లు మార్కెట్ విలువ కోల్పోయింది. ఈ రోజు నిఫ్టీ స్మాల్‌క్యాప్100 0.77 శాతం, నిఫ్టీ మిడ్‌క్యాప్100 1.10 శాతం పెరిగింది. ఇరాన్‌పై ఐదు రోజులపాటు దాడుల్ని నిలిపివేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్లకు మంచి బలాన్నిచ్చింది. అలాగే అంతర్జాతీయ మార్కెట్లు కూడా లాభాల్లోనే కొనసాగడం కలిసొచ్చింది. దీంతో సోమవారం నష్టాల్లో ముగిసిన మార్కెట్లు మంగళవారం లాభాలబాట పట్టాయి. ఇన్వెస్టర్ల సంపద మంగళవారం ఒక్క రోజే రూ.7 లక్షల కోట్లకు పెరిగింది. దీంతో మొత్తం మార్కెట్ విలువ రూ.423 లక్షల కోట్లకు చేరింది. నేడు ఉదయం ట్రేడింగ్ లాభాల్లోనే ప్రారంభమైంది. సోమవారం 72,696.39 వద్ద ముగిసిన సెన్సెక్స్ మంగళవారం ఉదయం 74,212.47 వద్ద లాభంతో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. మరోవైపు డాలర్‌తో రూపాయి విలువ 93.86గా ఉంది. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 101 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర 4,430 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## పడిపోయిన బంగారం ధరలు.. రూ.2,940 తగ్గిన గోల్డ్.. భారీగా తగ్గిన వెండి

దేశంలో బంగారం ధరలు వరుసగా తగ్గుముఖం పడుతున్నాయి. హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,350గా ఉంది. ఇంతకుముందు రోజు రూ.14,32,90 ఉంది. అంటే ఒక్క రోజులోనే రూ.2,940 వరకు తగ్గింది. ఇరాన్‌పై దాడులను నిలిపివేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం, రూపాయి విలువ తగ్గడం, డాలర్ బలపడటం వంటి కారణాలు బంగారం ధరలపై తీవ్ర ప్రభావం చూపాయి. సాధారణంగా డాలర్ విలువ పెరిగితే బంగారం ధరలు తగ్గుతాయి. ఇదే సమయంలో వెండి ధరలు కూడా భారీగా పతనమవుతున్నాయి. ఈ నెలలోనే బంగారం ధరలు దాదాపు 19.52 శాతం పడిపోయాయి. 1975 తర్వాత ఒక నెలలో ఈ స్థాయిలో బంగారం ధరలు పతనమవ్వడం ఇదే మొదటిసారి అని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో



ఒక ఔన్స్ బంగారం ధర సుమారు 4,263 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ప్రస్తుతం వివిధ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు ఈ విధంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,350, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,27,777, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,04,544గా ఉంది. ఇక చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 14,1820, 22 క్యారెట్ల ధర రూ. 1,30,000, 18 క్యారెట్ల ధర రూ. 10,82,00, ముంబైలో ముంబై.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 14,0350, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 12,8650, 18 క్యారెట్ల బంగానం ధర రూ. 10,5260, బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 14,0350, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 12,8650, 18 క్యారెట్ల బంగారం ధర రూ. 10,526, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.14,0350, 22 క్యారెట్ల బంగారం ధర రూ.12,86,50, 18 క్యారెట్లు బంగారం ధర రూ10,52,60. వెండి కిలో ధర రూ.2,18,348గా ఉంది. నిన్నటితో పోలిస్తే దాదాపు 3.03 శాతం పతనమైంది.

## రికార్డు స్థాయిలో చికెన్ ధరలు ...!

అమరావతి : తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండుతోన్న వేళ ... మాంసప్రియులకు భారీ షాక్ తగిలింది. చికెన్ ధరలు రికార్డు స్థాయికి చేరింది. అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలో గత కొన్ని రోజులుగా చికెన్ రేట్లు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. మార్చి 24, 2026 నాటి తాజా నివేదికల ప్రకారం .... ఉత్పత్తి తగ్గడం, డిమాండ్ పెరగడం వల్ల మార్కెట్లో కోడి మాంసం ధరలు పెరిగాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరల పెరుగుదలతో సతమతమవుతున్న సామాన్య ప్రజలకు చికెన్ భారం మరింత ఆందోళన కలిగిస్తోంది.



భాగ్యనగరంలో ...


భాగ్యనగరం హైదరాబాద్‌లో చికెన్ ధరలు ప్రస్తుతం పీక్ స్టేజ్‌లో ఉన్నాయి. ఇక్కడ లైవ్ కోడి కిలో రూ.230 నుంచి రూ.250 వరకు పలుకుతుండగా, స్కిన్‌తో కూడిన చికెన్ రూ.340 నుంచి రూ.360 కి చేరింది. ఇక స్కిన్‌లెస్ చికెన్ ప్రియులు కిలోకు రూ.360 నుంచి రూ.380 వరకు చెల్లించాల్సి వస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో కూడా పరిస్థితి దాదాపు ఇలాగే ఉంది. అక్కడ స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.400 మార్కును తాకుతోంది. విశాఖపట్నం, వరంగల్ వంటి నగరాల్లో కూడా చికెన్ రేట్లు సగటున రూ.350 పైనే ఉన్నాయి. ఇక నాటు కోడి విషయానికి వస్తే, దీని ధర అక్షరాలా రూ.700 నుంచి రూ.900 వరకు ఉండటం గమనార్హం.

# స్పోర్ట్స్

## పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు గాయం?

### ముంబై ఇండియన్స్‌లో టెన్షన్!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ మార్చి 28న ప్రారంభం కానుంది. ఐపీఎల్ ప్రారంభానికి కొన్ని రోజులు మాత్రమే ఉంది. సరిగ్గా ఈ సమయంలో ముంబై ఇండియన్స్‌ను టెన్షన్ పెట్టే ఒక వార్త వచ్చింది. స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై ఇంకా క్లారిటీ లేదు. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలోని ముంబై తన మొదటి మ్యాచ్‌ను మార్చి 29న వాంఖడే స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ తో ఆడనుంది. జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన బౌలర్లలో ఒకడు. తన బౌలింగ్, యార్కర్లతో మ్యాచ్ స్వరూపాన్ని మార్చగలడు. అతడి బౌలింగ్‌లో దిగ్గజ బ్యాటర్లు కూడా మానసిక ఒత్తిడికి లోనవుతారు. ఇటువంటి పరిస్థితుల్లో అతడు నిజంగానే గాయపడ్డాడా, అందుకే ముంబై




క్యాంపులోకి ఇంకా చేరలేదని ప్రచారం జరుగుతోంది. 2021 నుండి ఒక్కసారి కూడా ఫైనల్‌కు చేరుకోని ముంబై ఇండియన్స్‌కు బుమ్రా గాయం, ఫిట్‌నెస్ చాలా ముఖ్యమైన అంశం. ఐపీఎల్ 2026 కోసం ముంబై ఇండియన్స్ ఇప్పటికే ప్రాక్టీస్ మొదలుపెట్టింది. అయితే నివేదికల ప్రకారం, జస్ప్రీత్ బుమ్రా ప్రస్తుతం కర్ణాటకలోని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో ఉన్నాడు. అందిన సమాచారం ప్రకారం, బుమ్రా ఇంకా ట్రైనింగ్ క్యాంప్‌లో చేరలేదు. అయితే బుమ్రా ఏదైనా గాయంతో బాధపడుతున్నారా లేదా కేవలం రొటీన్ చెకప్ కోసం అక్కడ ఉన్నాడా అనేదానిపై స్పష్టత లేదు. 2024 నుంచి హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. 2024లో జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికే పరిమితమైంది. గతేడాది జట్టు ప్లేఆఫ్స్ వరకు చేరుకుంది కానీ, ఫైనల్‌కు కూడా చేరలేదు. ముంబై ఇండియన్స్ తన ఆరో టైటిల్ కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తోంది. ఆ 5 ఐపీఎల్ టైటిల్స్ రోహిత్ శర్మ కెప్టెన్సీలో ముంబై సాధించింది. జస్ప్రీత్ బుమ్రా 2013 నుండి ముంబై ఇండియన్స్ తరపున ఆడుతున్నాడు. బుమ్రా ఐపీఎల్ లో 145 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండుసార్లు 5 వికెట్ల ప్రదర్శన చేశాడు.

## ఐపీఎల్ 2026లో కొత్త రూల్..

### బంతి మార్పుపై బీసీసీఐ కీలక నిర్ణయం

ఐపీఎల్ 2026 సమరానికి కౌంట్‌డౌన్ మొదలైపోయింది. మార్చి 28 నుంచి మైదానంలో పరుగుల వరద పారనుంది. ప్రతి ఏటా ఐపీఎల్‌లో ఏదో ఒక కొత్త నిబంధన వచ్చి ఆటతీరును మార్చేస్తుంటుంది. గతంలో వచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ లాగా ఈసారి భారీ మార్పులేవీ లేకపోయినా, బౌలర్లకు ముఖ్యంగా సెకండ్ ఇన్నింగ్స్ వేసే టీమ్స్‌కు ఊరటనిచ్చేలా బీసీసీఐ ఒక సరికొత్త బాల్ రూల్‌ను తీసుకొచ్చింది. ఈ నిబంధన వల్ల మ్యాచ్‌లు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి. క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. ఐపీఎల్ 2026లో బంతి వినియోగానికి సంబంధించి అంపైర్లకు మరిన్ని అధికారాలు కల్పించారు. మ్యాచ్ జరుగుతున్నప్పుడు బంతి ఎక్కడైనా పోయినా లేదా దాని ఆకారం పూర్తిగా దెబ్బతిన్నా, అంపైర్లు వెంటనే దాన్ని మార్చేయవచ్చు. అయితే, ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. పాత బంతికి బదులు కొత్త బంతిని ఇవ్వరు. ఆ బంతి ఎన్ని ఓవర్ల పాటు వాడబడిందో, దాదాపు అదే స్థితిలో ఉన్న మరో పాత బంతిని అంపైర్లు ఎంపిక చేస్తారు.




ఈ నిర్ణయం తీసుకునే ముందు బ్యాటర్లకు, ఫీల్డింగ్ కెప్టెన్‌కు అంపైర్లు సమాచారం అందిస్తారు. రాత్రి పూట జరిగే మ్యాచ్‌లలో సెకండ్ ఇన్నింగ్స్ బౌలింగ్ చేసే జట్లకు మంచు అనేది పెద్ద శాపంగా మారుతుంటుంది. బంతి తడిచిపోవడం వల్ల బౌలర్లకు గ్రిప్ దొరకదు, ఫలితంగా బ్యాటర్లు సులభంగా పరుగులు చేసేస్తారు. ఈ సమస్యను పరిష్కరించడానికి బీసీసీఐ ఒక వినూత్న నిబంధన తెచ్చింది. దీని ప్రకారం, రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసే జట్టు 10 ఓవర్లు ముగిసిన తర్వాత ఒక్కసారి బంతిని మార్చమని అంపైర్లను కోరవచ్చు. ఈ అవకాశం ఇన్నింగ్స్ మొత్తంలో కేవలం ఒక్కసారి మాత్రమే ఉంటుంది. దీనివల్ల బౌలర్లు మంచు ప్రభావాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చు. బంతి మార్చమని కోరడానికి ఫీల్డింగ్ జట్టు ఒక ముఖ్యమైన షరతును పాటించాల్సి ఉంటుంది. బంతిని కేవలం ఓవర్ పూర్తయిన తర్వాతే మార్చాలి. ఓవర్ మధ్యలో బంతిని మార్చడానికి అంపైర్లు అనుమతించరు. అంతేకాకుండా, బంతిని మార్చడానికి మంచు ఉండాలనే నిబంధన ఏమీ లేదు. కేవలం బంతి పట్టు దొరకడం లేదని లేదా పరిస్థితి బాగోలేదని భావిస్తే కెప్టెన్ ఈ అభ్యర్థన చేయవచ్చు. అయితే, ఈ సందర్భంలో కూడా అంపైర్లు పాత బంతికి దాదాపు దగ్గరగా ఉండే మరో బంతినే ఇస్తారు తప్ప సరికొత్త బంతిని ఇవ్వరు. ఫీల్డింగ్ టీమ్ అడిగినప్పుడు కాకుండా, ఒకవేళ మ్యాచ్ మధ్యలో బంతి పరిస్థితి మరీ దారుణంగా తయారైందని అంపైర్లు భావిస్తే, వారు తమకు తోచినప్పుడు బంతిని మార్చే అధికారం కలిగి ఉంటారు. ఐపీఎల్ వంటి హై వోల్టేజ్ టోర్నమెంట్‌లో ప్రతి పరుగు, ప్రతి వికెట్ ముఖ్యం కాబట్టి, ఆటలో పారదర్శకత, సమానత్వం కోసం ఈ రూల్స్ తీసుకొచ్చారు. ముఖ్యంగా టాస్ గెలిచి సెకండ్ బ్యాటింగ్ ఎంచుకునే జట్లకు ఉన్న అడ్వాంటేజ్‌ను ఈ రూల్ కొంతవరకు అడ్డుకునే అవకాశం ఉంది, దీనివల్ల పోటీ మరింత రసవత్తరంగా మారుతుంది.

## రూ. 15 వేల కోట్లకు అమ్ముడైన రాజస్థాన్ రాయల్స్!





రాజస్థాన్ రాయల్స్ అమ్మకం ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. కల్ సోమాని నేతృత్వంలోని కన్సార్టియం 1.63 బిలియన్ డాలర్లకు జట్టును కొనుగోలు చేసింది. ఈ క్రమంలో 1 బిలియన్ డాలర్లకు అమ్ముడైన తొలి ఐపీఎల్ జట్టుగా ఆర్ఆర్ నిలిచింది. కల్ సోమాని కన్సార్టియానికి వాల్‌మార్ట్ కుటుంబానికి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త రాబ్ వాల్టన్, అలాగే ఎంఎఫ్ఎల్ జట్టు డెట్రాయిట్ లయన్స్‌లో మెజారిటీ వాటాలు కలిగిన హాంప్ కుటుంబం నుంచి ఆర్థిక మద్దతు లభించింది. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యంత ఖరీదైన డీల్. ఈ డీల్‌తో రాజస్థాన్ రాయల్స్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఫ్రాంచైజీగా నిలవనుంది. ఐపీఎల్ 2026 ముగిసిన తరువాత కొత్త యాజమాన్యం బాధ్యతలను స్వీకరించనుంది. గతంలో సంజీవ్ గోయెంకాకు చెందిన ఆర్‌పిఎస్‌జి గ్రూప్ లక్నో సూపర్ జెయింట్స్‌ను 940 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయగా.. టొరెంట్ గ్రూప్ గుజరాత్ టైటాన్స్‌లో 67 శాతం వాటాను 575 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్త అయిన సోమాని ఇప్పటివరకు రాజస్థాన్ రాయల్స్‌లో మైనారిటీ వాటాను కలిగి ఉన్నారు. ఆయన 2021లోనే రాజస్థాన్ రాయల్స్‌లో కొంత పెట్టుబడులు పెట్టారు. ఇక తాజాగా ఇప్పుడు మొత్తం 100 శాతాన్ని దక్కించుకున్నారు. అరిజోనాకు చెందిన సొమానీ.. డేటా ప్రైవసీ, ఎడ్‌టెక్, క్రీడా సాంకేతికత తదితర రంగాల్లో 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఎంట్రప్రెన్యూర్. ఆయన ఇంట్రాఎడ్జ్, ట్రూయో, ఏఐ, అకాడెమియన్ వంటి సంస్థలకు ఫౌండర్. అంతేకాకుండా మోటార్ సిటీ గోల్ఫ్ క్లబ్‌కు సహ-యజమాని, టిఎమ్ఆర్‌డబ్ల్యూ స్పోర్ట్స్, టిజిఎల్ గోల్ఫ్ లీగ్‌లలో తొలి పెట్టుబడిదారులలో ఒకరు.

....



## ఆ సినిమా చేసినందుకు నన్ను ట్రోల్ చేశారు..


నేను శైలజ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది హీరోయిన్ కీర్తి సురేష్. తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న ఈ అమ్మడు.. ఆ తర్వాత మహానటి సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువయ్యింది. అలనాటి హీరోయిన్ సావిత్రి జీవితకథగా వచ్చిన ఈ చిత్రంలో మహానటి సావిత్రి పాత్రలో కీర్తి అద్భుతంగా నటించింది. తన నటనతో సావిత్రినే మరిపించి ఆడియన్స్ హృదయాల్లో మహానటిగా పేరు సంపాదించుకుంది.ఆ తర్వాత ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి అగ్రకథానాయికగా వరుస హిట్లతో సక్సెస్ ఫుల్ గా రాణిస్తోంది. ప్రస్తుతం తెలుగు , తమిళ్ తో పాటు హిందీలోనూ సినిమాలు చేస్తుంది ఈ వయ్యారి భామ. గతంలో కీర్తిసురేష్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన ఫిల్మ్ కెరియర్.. సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోల్స్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది కీర్తి సురేష్.ఆమె మాట్లాడుతూ.. మహానటి చిత్రాన్ని ఓకే చేసినందుకు తనను కొందరు ట్రోల్ చేశారని.. ఆ సినిమా పూర్తయ్యాకే ఈ విషయం తనకు తెలిసిందని చెప్పుకొచ్చింది. తనపై వచ్చిన విమర్శలు పక్కనపెడితే సావిత్రమ్మ పాత్రలో నటించినందుకు చాలా గర్వంగా ఉందన్నారు కీర్తి. "మహానటి చిత్రంలో నటించేందుకు ముందుగా ఒప్పుకోలేదు. సావిత్రమ్మ పాత్రలో నటించేందుకు చాలా భయమేసింది. కానీ దర్శకుడు నాగ్ అశ్విన్ నన్ను ప్రోత్సహించారు.నువ్వు చేయగలవు అనే ధైర్యనిచ్చారాయన. ఆయనకే అంత నమ్మకం ఉంటే.. నేను ఎందుకు భయపడాలి అనుకున్నాను. అలాగే మహానటి పూర్తిచేశా. ఆ పాత్రలోనటిస్తున్నందుకు కొంత మంది నన్ను ట్రోల్ చేశారు. ఆ విషయం నాకు తెలియదు. ఆ సినిమా ప్రమోషన్లలో పాల్గొన్నప్పుడు దీనిపై ప్రశ్న ఎదురైంది. అప్పుడు తెలిసింది నాపై ట్రోల్స్ వచ్చాయని.సోషల్ మీడియాలో నాపై వచ్చే నెగెటివిటీపై పెద్దగా ఆసక్తి చూపను. అందుకే నాపై ట్రోల్స్, విమర్శలు రావు. సావిత్రమ్మకు బయోపిక్ లో నటించడం భయంగా అనిపించింది. ఆమె కుమార్తెతో మాట్లాడి ఎన్నో విషయాలను తెలుసుకున్నాను. ఎన్నో సవాళ్లు ఎదురైనా కూడా ఆ పాత్ర చేసినందుకు మాత్రం గర్వపడుతున్నాను" అంటూ చెప్పుకొచ్చారు కీర్తి సురేష్.




## పెద్ది టీజర్ కోసం అభిమానుల ఆసక్తి

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ రఫ్ అండ్ మాస్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రెండో సింగిల్ 'రై రై రా రా' సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా.. ముఖ్యంగా రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం గచ్చిబౌలి స్టేడియంలో క్రూషియల్ షెడ్యూల్‌తో బిజీగా ఉంది చిత్ర యూనిట్. నాలుగు రోజుల పాటు ఈ షెడ్యూల్ షూటింగ్ జరగనుందని సమాచారం. ఇక పెద్ది సినిమా నుంచి టీజర్ రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్. అఫీషియల్ కన్ఫర్మేషన్ లేకపోయినా, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న పెద్ది టీజర్ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే, చరణ్ బర్త్ డేకి మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. కానీ, ఇప్పటి వరకు పెద్ది టీమ్ నుంచి టీజర్ గురించి ఎలాంటి అప్డేట్ లేదు. మెగాభిమానులు మాత్రం ఈసారి తమ అభిమాన హీరో బర్త్ డేని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు. మార్చి 26 సాయంత్రం నుంచి హైదరాబాద్ శిల్పకళా వేదికలో గ్రాండ్ ఈవెంట్ ఎ÷–లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రామ్ చరణ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. నార్త్ అమెరికాలో మార్చి 26 నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక్కడి నుంచి పెద్ది సౌండ్ గట్టిగా ఉంటుందని నమ్ముతున్నారు మెగాభిమానులు.

## పెద్దితో చిందేయనుందా?




మృణాల్ ఠాకూర్ తెలుగులో మూడు సినిమాలు చేస్తే, వాటిలో రెండు విజయాలను అందుకున్నాయి. త్వరలో ఆమె 'డెకాయిట్' సినిమాతో మరోసారి తెలుగుప్రేక్షకుల్ని పలకరించనున్నది. రిలీజ్‌కు ముందే ఈ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. ఇందులో మృణాల్ పాత్ర కూడా సామాన్యంగా ఉండదట. బలమైన భావోద్వేగాలతో ఆమె పాత్రను తీర్చిదిద్దారట దర్శకుడు షానియల్ డియో. ఈ పాత్రతో ఆమె కెరీర్ మలుపు తిరగడం ఖాయమని ఇన్‌సైడ్ టాక్. ఇక బన్నీ, అట్లీ సినిమాల్లోనూ మృణాల్ నటిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇదిలావుంటే.. తాజా సమాచారం ప్రకారం రామ్‌చరణ్ 'పెద్ది'లో స్పెషల్ సాంగ్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందట మృణాల్ ఠాకూర్. ఈ పాటలో జాన్వీ కపూర్ కూడా భాగం కానున్నదట. సినిమాకే ఈ పాట హైలైట్ అట. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది.



## శ్రీలీలకు వరుస ఫ్లాపులు.. 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా దెబ్బతీసినట్టేనా?

టాలీవుడ్‌లో సెన్సేషనల్ డెబ్యూతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన శ్రీలీల, చాలా తక్కువ కాలంలోనే స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు దక్కించుకుని బిజీ హీరోయిన్‌గా మారింది. తన డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో యూత్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం కెరీర్‌లో కాస్త కఠిన దశను ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. 'భగవంత్ కేసరి' వంటి కొన్ని సినిమాలు మినహా, ఆమె నటించిన చాలా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. ఈ నేపథ్యంలో, తాజాగా విడుదలైన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాపై ఆమె భారీ ఆశలు పెట్టుకుంది. ఇందులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించడం కూడా సినిమాకు హైప్‌ను తీసుకువచ్చింది. అయితే, సినిమా విడుదల తర్వాత పరిస్థితి ఆశించిన విధంగా లేకపోవడం గమనార్హం. విమర్శకుల నుంచి నెగిటివ్ టాక్ రావడంతో పాటు, బాక్సాఫీస్ వద్ద కూడా సినిమా ప్రదర్శన సంతృప్తికరంగా లేకపోవడం చిత్రబృందానికి నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ సినిమాలో శ్రీలీల పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం ప్రేక్షకులను నిరుత్సాహానికి గురిచేసింది. పవన్ కళ్యాణ్‌తో జోడీ విషయంలో సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోంది. క్యారెక్టర్ డిజైన్ సరైన స్థాయిలో లేకపోవడం, పెర్ఫార్మెన్స్‌కు పెద్దగా స్కోప్ లేకపోవడం వంటి అంశాలు విమర్శలకు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు స్టార్ హీరోల సినిమాల్లో వరుసగా అవకాశాలు అందుకున్న శ్రీలీల, ఇప్పుడు తన ఫామ్‌ను తిరిగి అందుకోవడానికి కృషి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీశీజఱవం ఇక, వరుస పరాజయాలు వచ్చినప్పటికీ, శ్రీలీల తన రెమ్యూనరేషన్ తగ్గించలేదన్న వార్తలు కూడా పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. దీనితో పలువురు నిర్మాతలు ఇతర హీరోయిన్లను ఎంపిక చేసుకునే దిశగా మొగ్గు చూపుతున్నారని సమాచారం. ప్రస్తుతం ఆమె చేతిలో పెద్దగా క్రేజీ ప్రాజెక్టులు లేకపోవడం కూడా ఆమె కెరీర్‌పై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో, శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్‌పై దృష్టి సారించినట్లు టాక్ వినిపిస్తోంది. కొత్త అవకాశాల కోసం హిందీ చిత్రసీమలో ప్రయత్నాలు ప్రారంభించిందని సమాచారం. టాలీవుడ్‌లో తిరిగి తన స్థానాన్ని సంపాదించుకోవడానికి ఆమె ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

## ధురంధర్-2 కు రజనీకాంత్ ప్రశంసలు




తాజా బ్లాక్‌బస్టర్ 'ధురంధర్ 2'పై సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనాన్ని చూసి.. ఆదిత్య ధర్ పనితీరును మెచ్చుకుంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆదిత్యను 'బాక్సాఫీస్ కా బాప్' అని ప్రశంసించడమే కాకుండా సినిమా అద్భుతంగా ఉందని రజనీకాంత్ కొనియాడారు. ఈ సందర్భంగా హీరో రణవీర్ సింగ్, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా అని అన్నారు. రజనీకాంత్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తలైవా పోస్ట్‌కు ఆదిత్య ధర్ ఎమోషనల్ రిప్లై పెట్టారు. 'మేమందరం వినోదం అనే పదానికి మీ ఒక్కరినే బెంచ్‌మార్క్‌గా చూస్తూ పెరిగాము. దశాబ్దాలుగా మమ్మల్ని విజిల్స్ వేయించేలా, నవ్వించేలా, భావోద్వేగానికి గురయ్యేలా.. మీరు వినోదానికి అసలైన అర్థం చెప్పారు. ఇప్పటికీ అదే స్టైల్.. అదే గ్రేస్‌తో మీరు చేస్తున్న మ్యాజిక్ అద్భుతం. అలాంటిది మీరు 'ధురందర్ 2'ను తప్పక చూడాల్సిన చిత్రం అని చెప్పడం నా జీవితంలో అతిపెద్ద 'సూపర్‌స్టార్' మూమెంట్‌గా అనిపిస్తోంది. పెద్ద కలలు కనేలా మమ్మల్ని ప్రోత్సహించిన వ్యక్తి నుంచి అందిన ఈ ప్రశంస ఒక వరంలా ఉంది. మీ మాటలకు నా హృదయం ఉప్పొంగుతోంది' అని దర్శకుడు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. మార్చి 19న విడుదలైన 'ధురంధర్ 2' చరిత్ర సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఇప్పటికే రూ.750 కోట్ల మార్కును దాటి రికార్డులు తిరగరాస్తోంది. రజనీకాంత్‌తో పాటు అల్లు అర్జున్, మహేశ్ బాబు, నాగార్జున వంటి ఇతర అగ్ర తారలు కూడా ఈ సినిమాపై ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com